# వీర స్వర్గం



*పరస్పరేణ క్షతయోః ప్రహర్త్రో*
*రుత్క్రాంతవాయ్వోః సమకాలమేవ*
*అమర్త్యభావే పితయోశ్చరాసీ*
*దేకాప్సర ః ప్రార్థితయోర్వివాదః*

***భావం:*** ఇద్దరు వీరులొకరితో ఒకరు కొట్టుకొని ఒకేసారి ప్రాణాలు విడిచి, స్వర్గానికి వెళ్ళి, అక్కడ కూడా ఒకే అప్సరసను కోరుకుని ఆమె కోసమై కొట్టుకోసాగారు.

ఆంధ్రదేశ రాజు కాలనాథుడు. చిత్రకూట ప్రాంతానికి రాజు ప్రమథనాథుడు. ఇద్దరికీ కళింగ రాజ్యంపై కన్ను పడింది. కళింగ దేశంలో ప్రవహించే లాంగలీనదీ జలాలు ఉపయోగించుకుని తమ దేశాన్ని సస్యశ్యామలం చేసుకోవాలని ఇద్దరి కోరిక. ఇద్దరూ కలిసి ఒప్పందానికి వచ్చి ఒకేసారి కళింగ దేశంపై దండెత్తారు.

కళింగ రాజు బలవంతుడే కానీ ఇద్దరూ ఒకేసారి యుద్ధానికి వచ్చేసరికి నిలబడలేక పోయాడు. కళింగరాజూ, రాజకుమారులూ యుద్ధంలో మరణించారు. అతని రాణివాసమంతా సహగమనం చేసింది. కళింగ రాజకుమార్తె ఏకాకినిగా మిగిలింది. ఆంధ్ర రాజు కాలనాథుడూ, చిత్రకూట ప్రభువు ప్రమథనాథుడూ విజయోత్సవాలు చేసుకున్నారు. సంబరాలు ముగిశాక పంపకాలు మొదలయ్యాయి. కోశాగారాన్ని సమంగా పంచుకున్నారు. లాంగలీ నదీ జలాల్ని ఎవరు ఎంత వాడుకోవాలి అన్నవిషయంలో ఒప్పందానికి వచ్చారు. కళింగ రాజ్యంలో సామంతుణ్ణి నియమించి ఇద్దరికీ సమంగా కప్పం కట్టేలా నిర్ణయించారు. కాలనాథుడు 'పంపకాలన్నీ సమంగా జరిగాయి. విజయుడైన రాజు ఓడిపోయిన రాజకుమార్తెను వివాహమాడడం రాజనీతి. కాబట్టి... అన్నాడు. కాలనాథుని మాట పూర్తి కాకుండానే ప్రమథనాథుడు 'అవును రాజ్యమే కాదు రాజకుమార్తె కూడా వీరభోజ్యమే ఆమెను నేను మనువాడతాను'అన్నాడు.

కాలనాథుని మీసం దువ్వి' నన్ను మించిన వీరుడెవ్వరు.? ఆమె నాదే' అన్నాడు. ప్రమథనాథుడు. మాది చిత్రకూటం పర్వతప్రాంతం. మా శరీరాలు దృఢమైనవి. మీరు సున్నిత శరీరాల వారు. మా ముందు మీరెంత' అన్నాడు. కళింగ యుద్ధంలో గెలవడానికి నేనంటే నేనే కారణమని ఇద్దరూ అన్నారు.యుద్ధ విజయానికి కారణమైనందుకు తమకే కళింగ రాకుమారి దక్కాలని ఇద్దరూ గట్టిగా చెప్పారు. ఇద్దరిలో ఎవరు వీరులో తేల్చుకోవాలనుకున్నారు. ఇద్దరి మధ్యా ద్వంద్వ యుద్ధం మొదలైంది. కాలనాథ,

ప్రమథనాథులిద్దరూ వీరత్వంలో సమానులు. ఇద్దరూ ఒకేసారి రెండవ వారిని హతమార్చారు. ఇద్దరికీ వీరస్వర్గం లభించింది.

స్వర్గంలో కలుసుకున్న ఇద్దరూ అనవసరంగా ఒక స్త్రీ కోసం ప్రాణాలర్పించామని బాధపడ్డారు. ఇకనైనా స్నేహంగా ఉందామనుకుంటూండగా ఒక అప్సరస కన్పించింది. ఈమె అందం ముందు కళింగ రాజకుమార్తె అందమే మూలకి అన్పించింది. ఈమె మీద మనసైంది. భూమిపై ఆగిపోయిన యుద్ధం స్వర్గంలో మళ్ళీ మొదలైంది. ఉధృతమైన నదీ ప్రవాహానికైనా ఎదురొడ్డి నిలబడవచ్చును కానీ స్త్రీ సౌందర్య ప్రవాహాన్ని నిలువరించవచ్చునా?

******